బునాదిగాని కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బునాది గాని కాల్వ మరమ్మతులకు రూ.269 కోట్లు

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

బీబీనగర్, మే 7 : బునాది గాని కాల్వ మరమ్మతుల కోసం రూ.269 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మక్తానంతారం, వెంకిర్యాల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బునాది గాని కాల్వను బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి వరకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం ఉన్న కాల్వలో చెట్లు, గుర్రపు డెక్క పెరిగి నీళ్లు చివరి వరకు వెళ్లడం లేదన్నారు. దీంతో పంట కోతకొచ్చే సమయంలో మండలంలోని మగ్దుంపల్లి గ్రామం వరకు కూడా నీళ్లు వెళ్లక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాల్వను 2.5 మీటర్ల నుంచి 6.5 మీటర్లకు పెంచనున్నామని, దీంతో 50 నుంచి 350 క్యూసెక్కుల నీరు పారనుందని చెప్పారు. ఎర్రకుంట చెరువు వద్ద కాల్వ ఆరు మీటర్ల వెడల్పు ఉన్నప్పటికీ స్ట్రక్చర్లు, కల్వర్టులు దెబ్బతినడంతో నీటి ప్రవాహం తగ్గిందన్నారు.

టెండర్ పూర్తి చేసుకుని కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారని రైతులకు క్రాప్ హాలిడే లేకుండా మక్తానంతరం నుంచి మగ్దుంపల్లి వరకు రెండు నెలల్లోపు త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు నీరందించనున్నట్లు పేర్కొన్నారు. సెకండ్ ఫేస్‌లో దసరా తర్వాత క్రాప్ హాలిడే ప్రకటించి 8 నెలల్లోపు కాల్వ ధర్మారం వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ యాక్విసేషన్ జగన్నాథరావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ పోచమల్లు, డీఈ లావణ్య, ఏఈ భారత్, మాజీ జడ్పీ చెర్మన్ నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

12న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలి : నర్సింహ

చౌటుప్పల్, మే 7 : ఈనెల 12న పట్టణంలో భూమి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, పాలకుల వైఖరిపై నిర్వహిస్తున్న సదస్సులో వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. ఆ సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కామ్రేడ్ రొడ్డ అంజయ్య 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా పేద ప్రజల సమస్యల కోసం అంజయ్య చేసిన పోరాటాలను ఆయన గుర్తు చేశారు. ఇండ్ల స్థలాలు కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇల్లు లేని పేదవారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సీపీఎం మండలాధ్యక్షుడు గంగాదేవి సైదులు, నాయకులు బొజ్జ బాలయ్య, బోయ యాదయ్య, మానే సాలయ్య, ఆర్.పద్మ, మిసాల శ్రీనివాస్, చింతల సుదర్శన్, యాట ముత్యాలు, జంగం అంజయ్య, గువ్వల చంద్రయ్య, కొండ రమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరు మల్లేశం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి : సీపీఎం

ఆలేరు రూరల్, మే 7 : మండలంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో బుధవారం పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఎలాంటి షరతుల్లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ కమిటీల పేరుతో రాజకీయ జోక్యాన్ని నివారించి అధికారులే పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు సుధగాని సత్తరాజయ్య, పిక్క గణేశ్, సంగి రాజు, మిట్ట శంకరయ్య, చౌడబోయిన యాదగిరి తదితరులున్నారు.

ఆర్థిక సాయం

వలిగొండలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎఫ్ఎస్‌సీఏ సంఘం సభ్యులు

వలిగొండ, మే 7 : మండల కేంద్రానికి చెందిన కొంతం అంజిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఎఫ్ఎస్‌సీఏ (ఫ్రెండ్స్ స్పోర్ట్స్ కల్చరల్ అసోసియేషన్) సంఘం సభ్యులు బుధవారం ఆయన కుమార్తె హర్షిత పేరు మీద రూ.87 వేలు ఎఫ్‌డీ చేసి బాండ్‌ను అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఏ సంఘం అధ్యక్షుడు కొండూరి బాలరాజ్ , పబ్బు ఉపేందర్‌బోస్, గంజి చండీప్రసాద్, కుంభం వెంకట పాపిరెడ్డి, అయిటిపాముల ప్రభాకర్, రవీంద్ర, సత్యనారాయణ, యానాల సత్యనారాయణరెడ్డి, కూర శ్రీనివాస్, బోళ్ల నాగరాజు పాల్గొన్నారు.

యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

పోలీస్ ప్రజా భరోసాలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, మే 7: యువత విద్యపై ఆసక్తి పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోదాడ డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి అన్నారు. కోదాడ మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, జీవితంలో ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ అనిల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వే నంబర్‌లో తప్పులను రెవెన్యూ సదస్సులో సరి చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం) : పల్లెర్ల రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 7 : భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలోనే మొదటిసారిగా ఆత్మకూరు(ఎం) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని పల్లెర్ల, సింగారంలో బుధవారం ఆయన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పల్లెర్లలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువగా భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, భూ విస్తరణ సమస్యలు ఎక్కువగా ఉండడంతో పాటు డిజిటల్ సంతకాలు లేకుండా పాస్ పుస్తకాలు అందించడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. నేరుగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను దరఖాస్తు ఫారాల్లో రాసిచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎలాంటి కోర్టు కేసులు, భూ వివాదాలు లేని అన్ని రకాల భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొమ్మలరామారం, వలిగొండ మండలాల తాసీల్దార్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, యాదయ్య, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, డీటీ షఫీ యెద్దీన్, ఆర్ఐలు మల్లికార్జున్‌రావు, పాండు, సర్వేయర్, స్వప్న పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణ సీఐగా భాస్కర్, రూరల్ సీఐగా శంకర్‌గౌడ్

బి. భాస్కర్

ఎం. శంకర్

యాదగిరిగుట్ట, మే7: యాదగిరిగుట్ట పట్టణ సీఐగా బి. భాస్కర్, రూరల్ సీఐగా ఎం.శంకర్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాచకొండ కమిషనరేట్ సీఐ సెల్‌లో విధులు నిర్వర్తించిన బి.భాస్కర్ పట్టణ సీఐగా బదిలీపై రాగా రాచకొండ సీపీ కార్యాలయంలో విధుల్లో ఉన్న ఎం.శంకర్ రూరల్ సీఐగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇరువురు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంతకు ముందు పట్టణ సీఐగా పనిచేసిన ఎం.రమేశ్ భువనగిరి పట్టణ సీఐగా, రూరల్ సీఐగా పనిచేసిన కొండల్‌రావు ఆలేరు ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వెళ్లారు.

ఆలేరు సీఐగా కొండల్‌రావు

ఆలేరురూరల్ : ఆలేరు నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా కొండల్‌రావు బాధ్యలు స్వీకరించారు. కొండల్‌రావుకు పోలీస్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐ కొండల్ రావు

శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్షణ చర్యలపై శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఎన్‌సీసీ వలంటీర్లకు శిక్షణ

వలిగొండ, మే 7 : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ వలంటీర్లకు కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు యుద్ధ ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన తక్షణ రక్షణ చర్యలపై బుధవారం కళాశాల ఆవరణలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాద సమయాల్లో సామాన్య ప్రజల రక్షణ, యుద్ధ సమయాల్లో గాయపడిన పౌరులు, ప్రజలను దవాఖానకు తరలించే అంశాలపై ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ కాంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ కే.సుఖేశ్, మురళి, భిక్షం పాల్గొన్నారు.

వాడపల్లి చెక్‌పోస్టు వద్ద లారీ తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ధాన్యం అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దామరచర్ల, మే 7: ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మండలంలోని వాడపల్లి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దొంగతనాలు జరుగకుండా నిరంతరం గస్తీ తిరగాలని, సరిహద్దు ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రా నుంచి గంజాయి, పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమంగా రవాణా కాకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం వాడపల్లి సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు.

లారీలను తనిఖీ చేశారు. ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు వాడపల్లి, నాగార్జునాసాగర్ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలన్నా 50 శాతం సివిల్‌సప్లై కోటా పూర్తి అయిన తర్వాత పూర్తిస్థాయిలో డాక్యుమెంట్లు తనిఖీ చేసిన తర్వాతనే అనుమతిస్తామని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

అందాల పోటీలను అడ్డుకుంటాం : శ్రీనివాస్

మాట్లాడుతున్న శివసేన జిల్లా అధ్యక్షుడు పూస శ్రీనివాస్

భువనగిరి అర్బన్, మే 7 : రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించబోయే అందాల పోటీలను అడ్డుకుంటామని శివసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పూస శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో బుధవారం శివసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉదరిపాల మల్లేశ్, ఎన్.శేఖర్, వెంకన్న, సాయి, ఉడుతా క్రాంతికుమార్, యాదమ్మ, శోభ పాల్గొన్నారు.

మోత్కూరులో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్

రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి : శ్యామ్ ప్రసాద్

మోత్కూరు, మే 7 : ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ జినుకల శ్యామ్ ప్రసాద్ అన్నారు. మోత్కూరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మోత్కూరు, గుండాల, ఆత్మకూరుం(ఎం), అడ్డగూడూరు మండలాల స్థాయి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించి ఈ నెల 10వరకు జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.యాద య్య, ఆయా మండలాల ఎంపీడీఓలు శంకరయ్య, రాములు, దేవేందర్, బాలాజీ, మున్సిపల్ కమిషనర్ సతీశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మరో కార్మికుడు మృతి

- పీఈఎల్ ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

శ్రీకాంత్ (ఫైల్)

మోటకొండూర్, మే 7: ఏప్రిల్ 29న కాటేపల్లి పీఈఎల్‌లో సంభవించిన భారీ పేలుడులో గాయాల పాలై హైదరాబాద్‌లోని యశోద దవాఖానాలో చికిత్స పొందుతున్న కార్మికుడు బర్ల శ్రీకాంత్(34) బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పీఈఎల్‌లో రియాక్టర్ పేలుడు ఘటనలో ఆదే రోజు ముగ్గురు కార్మికులు మృతి చెందగా, ఆరుగురికి తీవ్రగాయాలు కాగా హైదరాబాద్‌లోని పలు దవాఖానాల్లో చికిత్స పొందుతున్నారు. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన బర్ల శ్రీకాంత్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పేలుడు ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. శ్రీకాంత్ సొంత గ్రామం కాచారం కాగా ఆలేరులో నివాసం ఉంటూ గతంలో పెద్దకందుకూరు పీఈఎల్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చి మూడు సంవత్సరాల నుంచి కాటేపల్లిలో పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ

మోత్కూరు, మే 7: మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని బుధవారం గ్రామంలో జరిగిన సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రవెల్లి నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తొంట అబ్బులు, ప్రధాన కార్యదర్శి జోగు భాను ప్రసాద్, సహాయ కార్యదర్శి బందెల నర్సయ్య, కోశాధికారి బోడ శేఖర్, సాంస్కృతిక కార్యదర్శి ఎర్రవెల్లి నరేశ్, గౌరవాధ్యక్షుడిగా ఎర్రవెల్లి ముత్తయ్య, సలహాదారుడిగా తొంట నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడిగా శేఖర్

గుండాల, మే 7: విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ మండలాధ్యక్షుడిగా వస్తాకొండూర్ జేఎల్ఎం అనంతుల శేఖర్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు పగిడం యాదగిరి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకొని సన్మానించారు.

బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్

ప్రిన్సిపాల్ రవికుమార్

నందికొండ, మే 7 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న రాజశేఖర్ నిడమనూరు మండలం వేంపాడుకు బదిలీ కాగా ఆయన స్థానంలో వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న రవికుమార్ వచ్చారు.

చేతి పంపు మరమ్మతు చేయండి సారూ!

ఆత్మకూరు(ఎం) : సర్వేపల్లిలో నిరుపయోగంగా ఉన్న బోరింగ్

మండలంలోని సర్వేపల్లి గ్రామంలో తాగునీటి సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. గ్రామం మొత్తంలో ఉన్న ఒకే చేతి పంపు ఇప్పుడు మరమ్మతులకు గురవడంతో నీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ఇదే బోరింగ్ నీళ్లపై గ్రామస్తులు ఆధార పడేవారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లు అయినా ఈ బోరింగ్ నుంచే నీళ్లు సరఫరా చేసుకొని వినియోగించుకునే వాళ్లు. ఇప్పుడు అది మరమ్మతులకు గురవడంతో నీటికి ఇబ్బంది అవుతుందని, వేసవి కావడంతో సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సర్వేపల్లి గ్రామంలోని చేతి పంపుకు మరమ్మతులు చేసి వాడుకలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఆత్మకూరు(ఎం)

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని విస్తరించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

భువనగిరికలెక్టరేట్, మే 7 : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించి రైతులకు లాభసాటి దిగుబడులు పెరిగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. అనీల్ కుమార్ సూచించారు. మండలంలోని వీరవెల్లి గ్రామంలో బుధవారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వారు పాల్గొని మాట్లాడారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయం పొందడమే గాక కూలీల కొరత సమస్య తీరుతుందన్నారు. సాగులో నాణ్యమైన విత్తనాల వినియోగం, తగిన మొతాదులో ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. అధిక యూరియా వినియోగాన్ని తగ్గించి, సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. విక్రయ కేంద్రాల్లోని రసీదులను భద్రపర్చుకోవాలని, కష్టకాలంలో ఇవి నష్టపరిహారం పొందేందుకు తోడ్పడుతాయని సూచించారు. సాగునీటిని ఆదా చేసి, భావితరాలకు బాసటగా నిలవాలన్నారు. పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందడంతో పాటు చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యాచరణ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి సుభాషిణి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు బి. రాజా, మధుశేఖర్, భూగర్భ నీటి విభాగం ఇంజినీర్ అశ్విత్, మండల వ్యవసాయ అధికారి మల్లేశ్, వ్యవసాయ విస్తరణాధికారి సతీశ్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్యామసుందరి, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసచారి, మాజీ ఎంపీటీసీ కంచి లలితామల్లయ్య, అభ్యుదయ రైతులు కంచి మల్లయ్య, సురవరం చంద్రశేఖర్‌రెడ్డి, రేగు శ్రీశైలం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : హెచ్ఎం వేణుగోపాల్

సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం వేణుగోపాల్

ఆలేరురూరల్, మే 7 : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని హెచ్ఎం ఆకుల వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్ఎస్ పీడీ మాదాని జోసెఫ్ ఆధ్వర్యంలో వేసవి క్రీడలు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథెటిక్స్ బుధవారం క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు జూన్ 6 వరకు నిర్వహించనున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గంగుల శ్రీనివాస్, మోత్కూరి ఐలయ్య, పీడీ శివ తదితరులున్నారు.

ఎస్.లింగోటంలో సర్వీస్ వైర్లు చోరీ

- రెండోసారి ఘటన.. ఆందోళనలో రైతులు

వ్యవసాయ మోటార్ల వద్ద చోరీకి గురైన సర్వీసు వైర్లు

చౌటుప్పల్, మే 7 : మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో పలువురు రైతుల వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని దుండగులు బుధవారం చోరీ చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి బావుల వద్ద సర్వీస్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారు. 30 మంది రైతులకు సంబంధించిన మోటార్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఒక్కో రైతుకు సమారు రూ.4 నుంచి 5 వేల వరకు నష్టం చేకూరినట్లు వారు తెలిపారు. కాగా గత నెలలో కూడా ఇదే గ్రామంలో 10మంది రైతులకు చెందిన వైర్లను కూడా చోరీ చేశారు. స్థానిక దుర్గమ్మ ఆలయంలో కూడా హుండీ పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు దృష్టి పెట్టి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు. అంతేకాకుండా గతంలో చిన్నకొండూర్, మందోళ్లగూడెం, నేలపట్ల గ్రామాల్లో కూడా ఇలాంటి చోరీలు జరిగాయి.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : ఏఐటీయూసీ

భూదాన్‌పోచంపల్లి : మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్

భూదాన్‌పోచంపల్లి, మే 7 : ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలోని కోదండరాంరెడ్డి పెద్దన్న భవనంలో బుధవారం ప్రజా సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌ను తీసుకొచ్చి కార్మికుల శ్రమను దోచి పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట రామచంద్రారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేశ్, సీపీఐ మండల కార్యదర్శి గోడల భూషణ్, సీపీఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, సీఐటీయూ సభ్యులు మంచాల మధు, చేరాల లింగయ్య, పబ్బు యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

రామన్నపేట : నాలుగు లెటర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఈనెల 20 నుంచి జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి నకిరేకంటి రాము అన్నారు. గ్రామ పంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి ఖదీర్‌కు సమ్మె నోటిస్ అందించారు. కార్యక్రమంలో బొడ్డు రమేశ్, గాదే యాదయ్య, భారతమ్మ, ప్రమీల, లక్ష్మి, నర్సింహ, మేడి పృథ్వీ పాల్గొన్నారు.